రైతు బజారులలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురంలోని రైతుబజారులలో కూరగాయల ధరలు టమాట రూ. 23, వంకాయ 35, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 38, క్యాబేజి 25, ఫ్రెంచి బీన్స్ 55, క్యారెట్ 50, దొండ 28–35, చిక్కుడు 55, గోకర 50, బీట్‌రూట్ 28, క్యాప్సికం 60, ఆలు 23, దోస 18, సొర 15, పొట్ల 18, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 23. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నిత్యావసర వస్తువుల పంపిణీ

ఎల్‌బీనగర్: అనాథలను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య అన్నారు. ఆయన తండ్రి మామిడి రామయ్య వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం ఎల్‌బీనగర్‌లోని ఆనాథ విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ఆదరణలేక ఎంతో మంది చిన్నారులు అనాథలుగా మారుతున్నారని వీరికి చేయూతనివ్వడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పులిపలుపుల ఆనందం, పర్యతాలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి వినతి


వినతిపత్రం ఇస్తున్న సుజాతానాయక్

హస్తినాపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధి బీఎన్‌రెడ్డి నగర్ చౌరస్తా నుంచి హస్తినాపురం జిల్లా పరిషత్ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నంకు వెళ్లే 277 నంబర్ బస్సును జెడ్పీ రోడ్డుమీదుగా నడపాలని మంత్రికి కోరగా ఆయన సానుకూలంగా స్పందించాలరన్నారు.

సన్మానం

సైదాబాద్: కాంగ్రెస్‌లో అన్నివర్గాలకు సముచిత స్థానం లభిస్తుందని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం గాంధీభవన్‌కు వచ్చిన ఏఐసీసీ పరిశీలకుడు అమీద్ పటేల్‌ను ఆయన కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీలో కష్టపడే కార్యకర్తలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

క్రైస్తవులు ఐక్యంగా ఉండాలి


కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

మలక్‌పేట: క్రైస్తవులు యేసు చూపిన మార్గం అనుసరిస్తూ ఐక్యత చాటాలని మలక్‌పేట పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రాహం అన్నారు. శుక్రవారం సాయంత్రం మూసారంబాగ్ జీసస్ క్రైస్ట్ బిలీవర్స్ చర్చి అండ్ మినిస్ట్రీస్‌లో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. పాస్టర్ చార్లీ కర్క్ మరణానికి జ్ఞాపకార్థం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ సంతు కుమార్, శ్రీధర్, విజయ్ కుమార్, పాస్టర్ ప్రశాంత్, నవీన్, భూషణ్, ప్రేమ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న అంబికా కృష్ణ

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఏలూరు మాజీ ఎమ్మెల్యే, అంబికా దర్బార్ బత్తి అధినేత అంబికా కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు మరిగంటి లక్ష్మీనరసింహచార్యులు ఆయనను ఆశీర్వదించారు. అనంతరం దేవాలయ చైర్మన్ సోమ సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్ అంబికా కృష్ణను సన్మానించారు.

పేద జంటకు వివాహం



చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ గడ్డిఅన్నవరక్షేత్ర వీర వెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో మొగుళ్లపల్లి యువసేన ఆధ్వర్యంలో ఓ పేద జంటకు వివాహం జరిపించారు. వివాహానికి కావాల్సిన బంగారు పుస్తెలు, మట్టెలు, నూతన వస్త్రాలను మొగుళ్లపల్లి ఉపేందర్‌గుప్తా అందజేశారు. ఈ కార్యక్రమంలో యువసేన అధ్యక్షుడు సీహెచ్ పవన్, రాఘవరెడ్డి, సత్యానారాయణ, వినోద్, కిసన్‌రావు పాల్గొన్నారు.



బ్రిడ్జి వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

మూసారాంబాగ్ బ్రిడ్జిని మూసేస్తారా?

- రాకపోకలు నిలిపేయడంతో వాహనదారులకు ఇబ్బందులు
- వాహెద్‌నగర్ బ్రిడ్జిపై రాకపోకలు పెరగడంతో నిత్యం ట్రాఫిక్‌జామ్
- అధికారుల్లో లేని స్పష్టత


ధ్వంసమైన రోడ్డు

దిల్‌సుఖ్‌నగర్: నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే మూసారాంబాగ్ బ్రిడ్జిపై రాకపోకలు నిలిపేయడంతో ఆ ప్రాంతమంతా వెలవెలబోతుంది. మూసీ వరద ధాటికి రేలింగ్ వరదకు కొట్టుకుపోవడం, రోడ్డు గుంతలమయంగా మారడం, బ్రిడ్జి పటిష్టతపై అధికారులకు అనుమానాలు రావడంతో మూసారాంబాగ్ బ్రిడ్జిని ప్రస్తుతం పూర్తిగా మూసేశారు. బ్రిడ్జి కింద ఎటు చూసినా చెత్త కుప్పలు గుట్టలుగా పేరుకుపోవడం, బ్రిడ్జి అంతా గుంతలుగా మారి అస్తవ్యస్తంగా మారింది. రేలింగ్ వేసి రోడ్డును రిపేర్ చేస్తామని చెప్పిన అధికారులు అటువైపు రావడం మానేయడంతో బ్రిడ్జిని తాత్కాలికంగా మూశారా.. లేక శాశ్వతంగా మూసేశారా అన్నది తేలక వాహనాదారులు అయోమయానికి గురవుతున్నారు. ప్రస్తుతం వరదలు పూర్తిగా తగ్గిపోవడంతో మూసీ వరదలకు కొట్టుకు పోయిన ఐరన్ సెంట్రింగ్ దిమ్మెలను క్రేన్ ద్వారా ఒడ్డుకు చేర్చుతున్నారు. బ్రిడ్జికి రేలింగ్ వేసి రోడ్డుకు మరమ్మతు చేస్తారని భావించిన స్థానికులకు బ్రిడ్జిపై వద్ద ఎలాంటి పనులు ప్రారంభం కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈబ్రిడ్జిపై రాకపోకలతో నగరంలోకి వెళ్లేవారికి ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. బ్రిడ్జిని మూసివేయడంతో చుట్టూ తిరిగి కిలో మీటర్ల మేర ఎక్కువ దూరం ప్రయాణం చేయాల్సి వస్తుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరితే సమాధానం చెప్పకుండా దాట వేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


కొట్టుకుపోయిన సెంట్రింగ్ దిమ్మెలను ఒడ్డుకు చేర్చుతున్న దృశ్యం

ఆదర్శనీయులు సీనియర్ సిటిజన్లు

ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: పదవీ విరమణ పొందినప్పటికీ సమాజ సేవలో ముందుంటూ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని సీనియర్ సిటిజన్లు ఆదర్శంగా నిలుస్తున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ శ్రీసాయినగర్ సౌత్ కాలనీలో అభయ సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనాన్ని శనివారం ఆయన ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు చేసి సీనియర్ సిటిజన్స్ భవనాన్ని అధికారికంగా ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. కొందరు నాయకులు తమ స్వార్థప్రయోజనాల కోసం కాలనీ అసోసియేషన్ల నడుమ చిచ్చుపెట్టి కాలనీలను ఫేజ్–1, 2 లుగా విడదీసే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇలాంటి సమస్యలు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో చూస్తున్నామన్నారు. ప్రతీ కాలనీలో పార్కులు, అసోసియేషన్ భవనాలు, మైదానాలు తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. శ్రీసాయినగర్ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను కొంత మేరకు పరిష్కరించుకోవడం జరిగిందని, పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కొందరి అడ్డంకుల కారణంగా 118జీఓ సమస్య అలాగే ఉండిపోయిందని, ఈ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు బద్దం భాస్కర్‌రెడ్డి, పాటి యాదిరెడ్డి, చెరుకు ఉమేష్ గౌడ్, తూర్పాటి చిరంజీవి, అనంతుల రాజారెడ్డి, సిద్ధాల ఐలయ్య, గోపాలకృష్ణ, రాములుగౌడ్, అశోక్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, రేవంత్‌గౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

ముగిసిన స్వర్ణకార సంఘం ఎన్నికలు


విజయం సాధించిన వారికి పత్రాలు అందజేస్తున్న వేణుగోపాల్

చైతన్యపురి: ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల విశ్వబ్రాహ్మణ స్వర్ణకార ఎన్నికల్లో మొత్తం 537 ఓట్లు ఉండగా 508 పోలయ్యాయి. అధ్యక్షుడిగా ముగ్గురు, ప్రధాన కార్యదర్శిగా ఇద్దరు, కోశాధికారిగా ఇద్దరు పోటీలో ఉన్నట్లు చీఫ్ ఎన్నికల అధికారి ఎర్రోజు వేణుగోపాల్ తెలిపారు. అధ్యక్షుడిగా కీర్తిగారి అనంతాచారి 250 ఓట్లు సాధించి సమీప అభ్యర్థి కిష్టాపురం రవిచారిపై 85 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. అధ్యక్షుడిగా పోటీ చేసిన మరో అభ్యర్థి రాగిఫణి వెంకటరమణకి 84 ఓట్లు రాగా 9 ఓట్లు చెల్లకుండా పోయాయి. ప్రధాన కార్యదర్శిగా శ్రీరామదాసు గోవర్ధనచారి 269 ఓట్లు సాధించి అనంతపురం నరేష్‌చారిపై 43 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. కోశాధికారిగా తటుకునూరి రవిచారి 290 ఓట్లు సాధించి ఆకునూరి శివచారిపై 82 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందినట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఎన్నికల నిర్వహణ అధికారులుగా టీఎల్ఎన్ స్వామి, మాల్కారం శ్రీనివాస్, రాచకొండ శ్రీనివాస్, వింజమూరి ప్రభుచారి, నర్సింహాచారి, నరేందర్‌చారి, బాలరాజు, నారాయణ చారి వ్యవహరించారు.

జీపు బీభత్సం

ఒకరికి గాయాలు

మలక్‌పేట: అదుపుతప్పిన ఓ జీపు పండ్ల దుకాణాల్లోకి దూసుకెళ్లిన ఘటన మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.పోలీసుల వివరాల ప్రకారం.. వైజాగ్ నివాసి హరి(23) శాలివాహన నగర్ కాలనీ నుంచి దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్తుండగా జీపు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న పలు పండ్ల దుకాణాల్లోకి దూసుకెళ్లింది. అప్పుడే అటుగా యాక్టివాపై వెళ్తున్న ఉప్పల్ నివాసి ప్రభాకర్ (60)ఢీ కొట్టడంతో కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి వెంటనే చికిత్స నిమిత్తం శాలివాహన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు హరిని అదుపులోకి తీసుకున్నారు.


పండ్ల దుకాణాల్లోకి దూసుకెళ్లిన జీపు

అవుట్‌లెట్ లేక ఇబ్బందులు

బడంగ్‌పేట్: అవుట్‌లెట్ లేని డ్రైనేజీ వ్యవస్థతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, 24వ డివిజన్ అధ్యక్షుడు నవారు మల్లారెడ్డి ఆరోపించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 24, 26వ డివిజన్‌లోని వేంకటేశ్వరకాలనీ, సాయి హోమ్స్ కాలనీల్లో డ్రైనేజీ పైప్‌లైన్లు ఉన్నప్పటికీ అవుట్‌లెట్ లేకపోవడంతో డ్రైనేజీ లైన్లన్నీ నిండి పొంగిపొర్లుతున్నాయన్నారు. దీంతో కాలనీల ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారన్నారు. ఈ సమస్య ఇప్పటిది కాదని గత ఐదు సంవత్సరాలుగా ఉందన్నారు. వర్షాకాలంలో మరింత అధికంగా ఉంటుందన్నారు. కాలనీవాసులు తమ దృష్టికి తీసుకురావడంతో శానిటేషన్ సిబ్బందిని పిలిపించి తాత్కాలింగా ఉపశమనం కల్పించామన్నారు. శాశ్వత పరిష్కారానికి 600 ఎంఎం డయా, ఆర్‌సీసీ పైపులు వేయాలన్నారు. ఈ సమస్యను కమిషనర్ పి.సరస్వతి దృష్టికి తీసుకెళ్లగా డీఈఈ వెంకన్నకు సమస్య పరిష్కరించేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. త్వరగా సమస్య పరిష్కరించేలా చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు వెంకటాచారి, భీమ్‌రెడ్డి, దాసు, జనార్ధన్, ప్రీతమ్‌నాయక్, మోహన్ నాయక్, వెంకటేశ్‌చారి తదితరులు ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చాదర్‌ఘాట్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..శనివారం మలక్‌పేట రిలయన్స్ డిజిటల్ షాపు వద్దనున్న రహదారిపై వ్యక్తి (50) స్పృహ తప్పి పడిపోయినట్లు గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది పరిశీలించగా మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పరామర్శ

మహేశ్వరం: మండల పరిధిలోని కేసీ తండాకు చెందిన మాజీ వార్డు సభ్యురాలు రాత్లావత్ టిక్లీ నాయక్ ఇటీవల మరణించడంతో శనివారం వారి కుటుంబాన్ని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి శనివారం పరామర్శించారు. రాత్లావత్ టిక్లీనాయక్ వార్డు సభ్యురాలిగా మహేశ్వరం గ్రామంతో పాటు కేసీ తండా అభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం గంగా రం తండాకు చెందిన మునావత్ ద్రోణి మరణించడంతో వారి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్, మాజీ ఎంపీపీ రాత్లావత్ సునీతానాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాత్లావత్ అంధ్యానాయక్, ఆవుల యాదయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శాంతినాయక్, కాంగ్రెస్ నాయకులు పాండునాయక్, రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

'విద్యార్థుల భవిష్యత్‌పై కాంగ్రెస్ నిర్లక్ష్యం'


దీక్షలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల

హస్తినాపురం: కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌ను నిర్లక్ష్యం చేస్తోందని వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల కోరారు. ఫీజీ రీయింబర్స్‌మెంట్, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యదర్శి నరేశ్‌యాదవ్ హస్తినాపురం సెంట్రల్‌లో చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షా రెండో రోజు ఎంపీ ఈటల హాజరై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని, వెంటనే స్పందించి బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, సామ రంగారెడ్డి, గణేశ్, వంగ మధుసూదన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

హస్తినాపురం: అయ్యప్ప భక్తి పరమార్థం గురుస్వాముల సేవాభావం భక్త సమాజానికి అందిస్తున్న ఆధ్యాత్మిక మార్గదర్శకమని ఈ భక్తి మార్గాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఎంపీ ఈటల అన్నారు. కర్మన్‌ఘాట్ హరిహరక్షేత్ర అయ్యప్ప దేవాలయంలో రమణగురుస్వామి గానం చేసిన శబరియాత్ర 16వ వాల్యూమ్,శరరణామృతం–5వ ఎడిషన్‌ను శనివారం ఎంపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శశిధర్, చంద్రారెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి, గంటి నాగేశ్ గురుస్వామి పాల్గొన్నారు.

జీఎస్ఐలో ఈ- వ్యర్థాల సేకరణ


ఈ-వ్యర్థాల సేకరణలో ఉద్యోగులు

మన్సూరాబాద్: భారతీయ భూవైజ్ఞానిక సర్వే సంస్థ (జీఎస్ఐ) ప్రధాన కార్యాలయంలో ఈ-వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎస్ఐ కార్యాలయ అధిపతి బసాబ్ ముఖోపాధ్యాయ హాజరై మాట్లాడారు. అక్టోబర్2న నుంచి 31 తేదీ వరకు ఈ–వ్యర్థాల స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమం ఉంటుందని పాత కంప్యూటర్లు, టీవీలు, మొబైల్ ఫోన్లు, బ్యాటరీలు, ప్రింటర్లు, ఫ్రిజ్‌లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలను సేకరించి పునర్వినియోగం చేయటం ముఖ్య లక్ష్యమన్నారు. ఎలక్ట్రానిక్ రీసైక్లర్ అయిన అటెరో రీసైక్లింగ్ ప్రైవేటు లిమిటెడ్, జవహర్‌లాల్ నెహ్రూ అల్యూమినియం రిసెర్చ్ డెవలప్‌మెంట్, డిజైన్ సెంటర్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు. దేశీయంగా ఈ–వ్యర్థాలను సేకరించి పునర్వినియోగం చేయటంతో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం జరుగుతుందన్నారు. ఈ–వ్యర్థాల అందజేయాలనుకునే వారు 9989862597ను సంప్రదించి రూ.100 నుంచి రూ.4వేల వరకు పొందవచ్చన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి


నూతన కమిటీ సభ్యులను ప్రకటిస్తున్న చంద్రమోహన్

చైతన్యపురి: పాలక వర్గాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక విధానాలను అందరూ సంఘటితంగా ప్రతిఘటించాలని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. చైతన్యపురిలోని కామ్రేడ్ బోడెపుడి వెంకటేశ్వరరావు స్మారక కేంద్రంలో శనివారం సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ.. సరూర్‌నగర్ సర్కిల్ ప్రాంతంలో ఉన్న అన్ని రంగాల కార్మికులు ఏకమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై వ్యతిరేక పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ నూతన కమిటీని ప్రకటించారు. సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ వీరయ్య, సభ్యులు గోకులచైతన్య, రాములు, లతీఫ్, శంకర్, చంద్రయ్య, పరశురాములు, ఈఏసు, యాదయ్య, శోభన్‌బాబు, పోలయ్య, కృష్ణ, యాదయ్య, నవనీత, ఆనంద్ ఎన్నికయ్యారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలి


మాట్లాడుతున్న ఆలేటి ఎల్లయ్య

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేసి వారికి కనీస వేతనం రూ.26, సూపర్‌వైజర్లకు రూ.35 వేలు చెల్లించాలని రంగారెడ్డి జిల్లా జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన రంగారెడ్డి జిల్లా జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రెండవ మహాసభలో ఎల్లయ్య పాల్గొని మాట్లాడారు. మరణించిన కార్మికుల, అనారోగ్యానికి గురైన ఉద్యోగస్తుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని, హెల్త్ ఇన్సూరెన్స్ రూ.8లక్షలు కార్మికులకు రెండు పడక గదుల ఇళ్లు, రేషన్ కార్డులు, మంజూరు చేయాలన్నారు. నగర విస్తరణాన్ని దృష్టిలో ఉంచుకుని కొత్త సిబ్బందిని నియమించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 14, 15న తుర్కయంజాల్‌లో జరగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

బడంగ్‌పేట్: మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల ఇన్‌చార్జి దాసరి బాబు కోరారు. ఈ మేరకు శనివారం బడంగ్‌పేట్‌లోని బాలాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14, 15వ తేదీల్లో తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో యూనియన్ రాష్ట్ర 5వ మహాసభలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక విధానాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 500ల మంది కార్మికులతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వేలాది మంది మున్సిపల్ కార్మికులతో బహిరంగ సభ ఉంటుందన్నారు. రాబోయే రోజుల్లో కార్మిక వర్గ సంక్షేమమే ధ్యేయంగా ఉద్యమించేందుకు చర్చించి, వారి సమస్యల పరిష్కారం కోసం ముందుకు వెళ్లనున్నట్లు వివరించారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ధనలక్ష్మి, నర్సింగ్, బాబు, సునీల్, మల్లేశ్, మాధవులు, జంగమ్మ, యశోధ, మహేశ్వరి, వెంకటమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంట్ అందజేత



బడంగ్‌పేట్: బడంగ్‌పేటలోని ప్రభుత్వ పాల్‌టెక్నిట్ కళాశాలకు శనివారం మాజీ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు తమ సొంత నిధులతో ఆర్వోప్లాంట్‌ను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్ విద్యార్థులు తాగునీటికి పడుతున్న ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తమ దృష్టికి తీసుకువావడంతో సొంత నిధులతో ఆర్వోప్లాంట్ అందించామని వెల్లడించారు. విద్యార్థులు ఆరోగ్యంతో శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ బంగారు బాబు, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.